క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించండి

వీరఘట్టం: మండలంలోని దశుమంతుపురం నుంచి జియ్యమ్మవలస మండలంలోని పెద్ద బుడ్డిడి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే జయకృష్ణను కోరారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో ఎమ్మెల్యేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ రెండు గ్రామాల మధ్య ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే 20 గ్రామాలకు మార్గం సుగమమవుతుందన్నారు. 3 కిలోమీటర్ల పొడవునా ఈ దారి అత్యంత అధ్వానంగా ఉందన్నారు.

పారిశుధ్య కిట్లు పంపిణీ



కిట్లు అందుకుంటున్న పారిశుధ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద పారిశుధ్య సిబ్బంది(గ్రీన్ అంబాసిడర్‌లు)కి పారిశుధ్య పనులకు అవసరమైన కిట్లు సోమవారం అందజేశారు. ఒక్కొక్కరికి హెల్మెట్, బూట్లు, రెండు రకాల గ్లౌజులు, మాస్కులు, మెడికల్ కిట్లు, కళ్లద్దాలు, షర్టులు అందజేసినట్లు సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరిశీలించారు. పనుల్లో డొల్లతనం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీ

బలిజిపేట: మండలంలో ఎస్జీటీ బదిలీల ప్రక్రియ పూర్తయి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ పూర్తయిందని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. మండలం నుంచి 23మంది వేరే మండలాలకు బదిలీపై వెళ్లినట్లు, అలాగే ఇతర మండలాల నుంచి 24మంది ఉపాధ్యాయులు ఈ మండలానికి బదిలపై వచ్చినట్లు చెప్పారు. మండల పరిధిలో అంతర్గతంగా 26మంది బదిలీ అయ్యారని మొత్తం మీద 50మంది ఉపాధ్యాయులు ఖాళీ పోస్టుల లో భర్తీ అయ్యారన్నారు. వాటికి సంబంధించిన ఉత్తర్వులను ఆయా ఉపాధ్యాయులకు అందించి, వచ్చిన వారిని జాయిన్ చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

పార్వతీపురంటౌన్: యోగాంధ్రలో భాగంగా పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా పలు యోగాసనాలు, విద్యార్థులతో అధ్యాపకులు వేయించారు. విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యాల మెరుగుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రిన్సిపాల్ జె.రామారావు ఈ సందర్భంగా అన్నారు. ప్రతి విద్యార్థి యోగా కోసం కొంత సమయాన్ని కేటాయించాలని, దినచర్యగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆకుల రాజు, ఎన్ఎస్ఎస్ పీఓలు తెర్లి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, డీటీ నాయుడు అధ్యాపకులు, ప్రదీప్, లక్ష్మణరావు, రామకృష్ణ, శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి యోగాంధ్రకు ఆశ్రమ విద్యార్థినులు

సాలూరు రూరల్: మండలంలోని కురుకూటి గిరిజన బాలికల ఆశ్రమపాఠశాల విద్యార్థినులు అమరావతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్రకు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 14 వ తేదీవరకు జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన యోగాంధ్ర పోటీలలో కురుకూటి ఆశ్రమ పాఠశాలకు చెందిన గెమ్మెల నవ్య, గెమ్మెల రమ్య, గెమ్మెల శ్రావణి, సీదరపు అంజలిలు ఎంపికయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి ఈ నలుగురు విద్యార్థినులను అమరావతి తీసుకువెళ్లారు.

'తల్లికి వందనం' కష్టాలు



పాలకొండ రూరల్: ఆన్‌లైన్‌లో నమోదుకు వేచి ఉన్న తల్లిదండ్రులు

వీరఘట్టం/పాలకొండ రూరల్: తల్లులకు తల్లికి వందనం పథకం కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల ఈ పథకం నిధులు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయగా, అర్హతా ఉన్నా తమ ఖాతాల్లో పడలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకం డబ్బులు పడని తల్లులు మళ్లీ నమోదు కోసం సచివాలయాలకు క్యూ కడుతున్నారు. రోజంతా ఉంటే తప్ప అక్కడ పని జరగని పరిస్థితి. అర్హులమై ఉన్నా తమకేంటి ఈ కష్టాలు అని వారంతా బాధపడుతున్నారు. ఇదిలా ఉంటే చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బందికి పథకం వర్తింపజేయకపోవడంతో వారు ఆందోళనబాట పడుతున్నారు. ఇంకొంతమంది ఇంట్లో ముగ్గురు ఉంటే ముగ్గురికీ పథకం డబ్బులు పడలేదని వాపోతున్నారు. ఇలా భిన్న పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల హామీ మేరకు అందరికీ ఇవ్వాలని పలువురు నిలదీస్తున్నారు.

కూటమి పాలన అంతా మోసమే..



పాలకొండ: వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్ సీపీ నాయకులు

- వెన్నుపోటు పుస్తకావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ:

కూటమి పాలన అంతా మోసమేనని..అధికారంలోకి వస్తే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఏడాదైనా వాగ్దానాలేవీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విమర్శించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటి వద్ద కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసంపై రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు అనేక హామీలిచ్చాయని, వాటి అమలులో మాత్రం ఘోరవైఫల్యం చెందాయన్నారు. ఏడాది పాలనలో కనీసం ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏడాదికి నాలుగు గ్యాస్‌బండలు అని మొదట చెప్పి, ఇప్పుడేమో మూడు ఇస్తున్నారని, మొదటి ఏడాది గ్యాస్ బండలు కూడా ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఇప్పుడేమో తల్లికి వందనం అందరికీ అని చెప్పి, కొందరికే ఇచ్చారని ధ్వజమెత్తారు. కూటమి నాయకులకు అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. అయితే ప్రజలకు మంచి జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రతిక్షణం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి, కేసులు, దాడులకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించే ఎంతోమంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి గద్దెనెక్కిన దగ్గరి నుంచి అశాంతి, అరాచకం, అక్రమాలు, అవినీతే రాజ్యమేలుతున్నాయన్నారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని తూ.చ తప్పకుండా అమలు చేశారని, సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి మరీ చెప్పిన తేదీకి చెప్పిన పథకం ఇచ్చారని చెప్పుకుంటున్నారన్నారు.

సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయండి..

బీసీ మహిళలకు 50 ఏళ్లకే పింఛన్.. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, వలంటీర్లకు రూ.10 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలేవీ ఎక్కడ అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తారో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23వ తేదీ నుంచి కూటమి ఇంటింటి ప్రచారానికి సిద్ధమవుతోందని, ప్రజలకు ఏం ఇచ్చారని, ఏం ఇచ్చామని చెప్పుకోవడానికి ఆ కార్యక్రమమన్నారు. మరోవైపు కుతంత్ర రాజకీయాలకు తెరలేపి, వైఎస్సార్ సీపీ నాయకులను ప్రలోభాలకు గురిచేసి లోబరుచుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్ సీపీ వెంటే జనం ఉన్నారని, జనం వెంటే వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలమల మన్మధరావు, కనపాక సూర్యప్రకాశరావు, పాలవలస దవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కోట అజయ్‌కుమార్, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, నల్లబారికి గాంధి, కొడెం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



జియ్యమ్మవలస రూరల్: వెన్నుపోటు పుస్తకం విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, తదితరులు

అప్పులు తప్ప.. అభివృద్ధి లేదు..

జియ్యమ్మవలస రూరల్: కూటమి ఏడాది పాలనలో అప్పులు, అబద్ధపు హామీలు తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో కూటమి ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన మోసంపై వైఎస్సార్ సీపీ రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 140కు పైగా హామీలిచ్చారని, ఇప్పటివరకు వాటిలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తానన్న చంద్రబాబు.. ఏడాదైనా సంపద సృష్టి కాలేదా అని ప్రశ్నించారు. కూటమి ఏడాది పాలనలో అక్రమాలు, అన్యాయాలు, మోసాలు, దారుణాలు, అవినీతే తప్ప ఇంకేమీ జరగలేదన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా గమనిస్తున్నారని, సమయం చూసి వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కురుపాం, జియ్యమ్మవలస మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



పాలకొండ: నరసింగరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: మండలంలోని పరశురాంపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బలగ నరసింగరావు మాతృమూర్తి బలగ లక్ష్మీదేవి ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, నరసింగరావును పరామర్శించారు. ఆయన తల్లి మృతికి సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెలగవాడ పంచాయతీలోని రుద్రిపేటకు వెళ్లి, నేరడబిల్లి ప్రసాద్‌ను పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి బాబూరావు మరణించగా, ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట వెలమల మన్మధరావు, కడగల రమణ, భాసూరు కాంతారావు, కొడెం విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

సీతంపేట: మండలంలోని శంభాం గ్రామ సర్పంచ్ నిమ్మక తిరుపతిరావు తల్లి నిమ్మక సూరమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. సూరమ్మ స్వగ్రామమైన జిల్లేడుపాడు వెళ్లి మరీ ఆమె అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు.

వీరఘట్టం: మండలంలోని హుస్సేన్‌పురం ఫీల్డ్ అసిస్టెంట్ ఖండాపు శ్రీనివాసరావు ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందగా, ఏపీవో జి.సత్యంనాయుడు సోమవారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అందే సాయం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'



పాలకొండ రూరల్: నవగాంలో ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

వీరఘట్టం/పాలకొండ రూరల్: మండలాల్లోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం సోమవారం చేపట్టారు. వీరఘట్టంలోని గాసి వీధిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి పాల్గొని, కాసేపు మాట్లాడారు.

పుట్టిన ప్రతి బిడ్డ వివరాలు అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల్లో నమోదు కావాలని, మూడేళ్ల వయసు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన, ఆటపాటలతో కూడిన విద్య, భోజనం అందించడం జరుగుతుందన్నారు. పాలకొండ మండలంలోని నవగాం గ్రామంలోనూ ఈమె పాల్గొని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

• ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పాలకొండ రూరల్: ఆర్టీసీలో ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు సమంజసం కాదని ఎస్‌ఎంయూ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు ఖండించారు. డిపో యజమాన్యాల వైఖరి నిరసిస్తూ మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఎస్‌ఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ రావు మాట్లాడుతూ అక్రమంగా తొలగింపులు, బదిలీల పేరిట సహోద్యోగులను యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గ్యారేజీల్లో సరైన పరికరాలు, స్పేర్స్ లేక అక్కడి సిబ్బంది వారు చేపట్టే విధుల్లో విఫలమతున్నారని, ఈ విషయం అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో బస్సులు తరచూ మొరాయిస్తున్నట్లు పేర్కొన్నారు. 1/2019 సర్క్యులర్ విజయనగరం జోన్‌లో అమలు చేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని, వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. లేకుంటే ఈ నెల 25వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వైకుంఠం, ఎంఆర్.మూర్తి, వి.రమణ, వై.నీలయ్య, చలం పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కొమరాడ: తెలంగాణ ప్రభుత్వం మాదిరి వీఆర్‌ఏల జీతాలకు సంబంధించి పే స్కేల్ అమలుచేయాలని మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఆర్.సూరయ్య కోరారు. ఇదే విషయమై ఆయన పలువురు వీఆర్‌ఏలతో కలిసి మండల తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, డిప్యూటీ తహసీల్దారు శివయ్యకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన వారికి పదోన్నతులు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

పాలకొండ రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఋషి యోగా కేంద్రం సహా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాల సాధన సోమవారం చేపట్టారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువులు తెలిపారు. అనంతరం పలు యోగాసనాల సాధన, వాటి ప్రయోజనాలు వివరించారు. ఋషి యోగా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాలకొండ ఏరియా ఆస్పత్రి వైద్యుడు జె.రవీంద్రకుమార్ పాల్గొని, రక్తదానం గూర్చి తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని, రక్తం దానం చేయడం ద్వారా లాభమే తప్ప నష్టమేమీ లేదన్నారు. రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



గరుగుబిల్లి: పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది



జియ్యమ్మవలస: బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు జయలక్ష్మి



పాలకొండ రూరల్: హౌసింగ్ ఏఈ సుధారాణి



గరుగుబిల్లి: బాధ్యతలు చేపడుతున్న ఏవో జ్యోత్స్న

జియ్యమ్మవలస: మండల తహసీల్దారుగా వై.జయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెకు సిబ్బంది స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీల్దారుగా మర్రాపు రాజేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

గరుగుబిల్లి: మండల ఏవో(అగ్రికల్చర్ ఆఫీసర్)గా టి.జ్యోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు.

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌గా అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పాలకొండ రూరల్: మండల గృహ నిర్మాణ శాఖ ఏఈగా యు.సుధారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

రెండో మెరిట్ జాబితా విడుదల

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఏకలవ్య పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్ష రెండో మెరిట్ జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ సోమవారం తెలిపారు. రెండో జాబితాలో 13 మంది ఎంపికైన విద్యార్థులు ఉన్నారన్నారు. ఎంపికై న విద్యార్థులు జూన్ 18వ తేదీలోగా పాఠశాలలో చేరాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో శ్రీనీలకంఠేశ్వరాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల తిరువీధి అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చరణల నడుమ శివపార్వతుల కల్యాణం వైభవంగా చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఆలయానికి చేరుకున్నారు.

రైల్వే జంక్షన్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం

సీతానగరం: పార్వతీపురం-విశాఖపట్నం జాతీయరహదారిలో నిరంతరం వందలాది మంది ప్రయాణికులు, వాహనాలు తిరుగాడే సీతానగరం రైల్వేస్టేషన్ జంక్షన్ సమీపంలో కల్వర్టు గోడలు కూలి ప్రమాదం పొంచి ఉందని తెలిసినా ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడుతున్న కారణంగా కల్వర్టుగోడ, కల్వర్టు హెచ్చరిక ఆనవాళ్లు లేక ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డుమీదుగా నిరంతరం ప్రజాప్రతినిదులు, ఉన్నతాధికారులు తిరుగాడుతున్నా కల్వర్టు విషయమై పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పాలకొండ: తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని నగరపంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. చాలీచాలని జీతాలతో జీవితం నెట్టుకొస్తున్న తమకు, తమ పిల్లలకు పథకాలు ఆపేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఎన్ఎంఆర్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు తల్లికి వందనం పథకం అందజేయాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పి.వేణు, సీహెచ్ సంజీవి, విమల, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే పట్టణాభివృద్ధి



సమావేశానికి హాజరైన సభ్యులు

పాలకొండ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని నగరపంచాయతీ కమిషనర్ రత్నంరాజు అన్నారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. పట్టణంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై సభ్యులు తీర్మానం చేశారు. తాగునీరు, చెత్త తరలించే వాహనాల మరమ్మతులు, వీధిదీపాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం అంశాలపై సభ్యులు చర్చించారు. సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు తెలిపారు. గారమ్మ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కడగల రమణ కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కమిషనర్ హామీఇచ్చారు. ముఖ్యంగా పట్టణంలోని బోర్లకు ప్లాట్‌ఫాంలు నిర్మించాలని సభ్యులు తీర్మానం చేశారు.

పీఎం జుగా సర్వేతో మరిన్ని సేవలు

సీతంపేట: పీఎం జుగా సర్వే ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించడం జరుగుతుందని ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు తెలిపారు. మండలంలోని చాకలిగూడ పంచాయతీ, గజిలి గ్రామంలో సోమవారం జరిగిన గ్రామసభకు హాజరైన ఆయన.. ఈ గ్రామసభల ద్వారా ప్రజాసమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆధార్, రేషన్, హెల్త్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, బ్యాంకు ఖాతాలు, గ్యాస్ కనెక్షన్ లేని వారు ఆయా శాఖల నుంచి ఆయా సేవలు పొందవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఎంపిక చేసిన 88 గ్రామాల్లో పీఎం జుగా గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు, ఎంపీడీవో మిశ్రో పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పీఎం జుగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం తెలిపారు. శివ్వాం పంచాయతీలోని సీమలవానివలస, చినగుడబ పంచాయతీలోని గదబవలస, రాయందొరవలసలో ఈ గ్రామసభలు ఉంటాయని, ఈ సభల్లో గ్రామస్తులకు అవసరమైన మౌలిక వసతులపై చర్చించి, వాటిని కల్పించడం జరుగుతుందన్నారు.

జాయినింగ్ ఆర్డర్లు అందజేత



జాయినింగ్ ఆర్డర్లు అందుకుంటున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా పలు చోట్లకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో డి.గౌరినాయుడు చేతులమీదుగా జాయినింగ్ ఆర్డర్లు సోమవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఆ దిశగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, భోజనం అందివ్వడం జరుగుతుందనే విషయాన్ని తెలియజేయాలన్నారు.

తక్షణమే రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

జియ్యమ్మవలస రూరల్: తక్షణమే రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు వై.జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమె తొలిసారిగా మండల కేంద్రంలోని తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, రైతుల సమస్యలను వెంటవెంటనే తీర్చాలని, పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలని సూచించారు.

ముగిసిన శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చింతలపాడు గ్రామంలో మామిడి, జీడి, పసుపు, అల్లం పంటల ధ్రువీకరణపై నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జట్టు ట్రస్టు సీఈవో ఎస్.ప్రహరాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు ధ్రువీకరణతోనే మేలు జరుగుతుందన్నారు. రైతు సాధికార సంస్థ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో ఆదితల్లి ఉత్పత్తిదారుల సంఘ సభ్యుల నిర్వహణలో అమెరికాకు చెందిన రెయిన్ ఫారెస్ట్ అలియన్స్ సంస్థ మామిడి, జీడి, పసుపు, అల్లం పంటలకు ధ్రువీకరణ చేయడం జరుగుతుందన్నారు. పార్వతీపురం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 గ్రామాలకు చెందిన రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు ధ్రువీకరణ చేయడం జరిగిందన్నారు. ఇది ప్రకృతి వ్యవసాయ రైతులు అభినందించాల్సిన విషయమన్నారు. కార్యక్రమంలో కో-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నూకంనాయుడు పాల్గొన్నారు.